లోకమే గురువు. లోకమే తల్లి. లోకమే తండ్రి. గురూ గారు చెప్పినట్లు "ఈ నోకంలో యేటుంది? మంచా - చెడా? కాదు. లాభవూ నష్టవేకద" లాభవొచ్చేపని అతను మాన్డు. నష్టవొచ్చేపని అతను చెయ్డు, దట్సాల్ ఐ టోల్డ్ ది నాస్టీ ట్రూత్!

# హేతువాదం సుబ్బరామయ్య

**మా** హేతువాదం సుబ్బరామయ్య బాబయ్య ముందు, మా చిన వెంకట్రావుడు పిన్ని అచ్చం భీముడి లాగుంటుంది. ఆవిడకు ఇంచక్కా క్రీపు హైర్ తెచ్చి మీసాలు అతికించి చేతిలో ఓ ఇత్తడి గదను పెడితే. ఇండియా కేవిటి చేస్తే అమెరికాకే ప్రెసిడెంటును చేయొచ్చు. (నెన్చెప్పినది మా పిన్ని పర్సనాలిటీ సంగతి). తెలుగులో చాలా మంది ఆడాళ్ళకు రావుడు పేరు మొగాళ్ళకు సీతన్న అనీ వుంటుంది. కాని, భీవుడి పేరు ఎక్కడా ఏ ఆడదానికీ వున్నట్టు నామట్టుకు నాకు తోచదు.

హిడింబాయమ్మగారని భకారావుగారు వాడారుకాని భీమేశ్వరి అని కూడా ఆడకూతుళ్ళకు పేరున్నట్లు ఎక్కడ వెతికినా కనబడదు. కమింగ్ టు ది పాయింట్ - మా చిన వెంకట్రావుడు పిన్ని భీవుడి లాగుంటుందని చెప్పుకున్నా మా సంగీతపు పిచ్చి ఎక్కువ.... ఒకటి రెండు హార్మనీలు రెండు మూడు ఫిడేళ్ళు విరగకొట్టాక వీణదగ్గర స్థిరపడిపోయింది. గాత్రం కూడా యిసుమంత వినసొంపుగానే వుంటుందుంటుందంటారుగాని, ఆవిడ కేసి చూస్తూ, ఆవిడ సంగీతం వింటూంటే సంగీతానికి అపకారం చేసినట్లు ఏదో ఫీలింగు వస్తుంది. చెప్పొద్దూ - ఆవిడ మ్యూజిక్ కాలేజీ ప్రిన్సిపాలయితే సంగీతం మ్యునిసిపాలిటీ పంపుల్లోంచి యింతలావు ధారతో ప్రవహిస్తుంది. అలా చెయ్యగల సామర్థ్యమున్న ఆడకూతురు చిన వెంకట్రావుడు, ది గ్రేట్ వరిజినల్ తెలుగు లేడీ. శ్రీ కృష్ణుడిలా, మన్మథుడిలా, విష్ణుమూర్తిలా, పార్వతీదేవిలాగా నల్లగా వున్నప్పటికీ కళాకాంతులున్న మొహం కనక మొగుడు ఎంత హేతువాదపురుషుడైనా భరిస్తూ వచ్చాడు. చిన వెంకట్రావుడికీ, సుబ్బరామయ్యకీ మధ్యన పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది. అతను ఎడ్డెం అంటే ఆవిడ తెడ్డెం అంటుంది. కాని అలాగే ఏడెనమండుగురు పిల్లలు ఒకరివెంటొకరు రైలు పెట్టెలలా తోసుకుని పుట్టుకొచ్చారు. ఏవిధంగాచూసినా యిది హేతువాదానికి కట్టుబడని ప్రశ్న.... చిన వెంకట్రావుడు పిన్ని పులిలాగుంటుంది. మా హేతువాదం సుబ్బరామయ్య బాబయ్య మేకలా వుంటాడు. వాళ్ళ సంసారం "పులి - మేకా' ' ఆట. మేక ఎంత హేతువాదాన్ని పురస్కరించుకుని మాట్లాడినా, పులిముందు హేతువాదం పనిచేయ్యదని గుడ్డిముండకు కూడా తెలిసే విషయంకదా - మా చిన వెంకట్రావుడు పిన్ని పిల్లలున్నారు. వాళ్ళు చదువుల్లో ఎలక్ట్రిక్ వైర్స్... ముట్టుకుంటే వాళ్ళ తెలివితేటలకి యివతల

వాడికి షాక్ కొట్టితీరుతుంది. చూట్టానికి పైకి జడ్డి వెధవల్లా గుంటారు కాని కదిపితే ఒక్కొక్కరు ఒక్కొక్కలైవ్ వైర్... అవి వాళ్ళనాన్న తెలివితేటలని చిన వెంకట్రావుడు చస్తే ఒప్పుకోదు. తనవీ, తన పుట్టింటివారివీ ప్రజ్ఞాప్రాభవాలని ఆమెకు గట్టి నమ్మకం. అలా ఒప్పుకోకపోవటం హేతువాద దృష్ట్యా పతివ్రతల లక్షణం కాదంటే పోస్ పొమ్మంటుంది.

సుబ్బరామయ్య పురుషుడే, బిడ్డల తండ్రేకాని, చిన వెంకట్రావుడి దృష్టిలో పిపీలికం. కారణం ఏవీలేదు. ఆవిడ ట్రెడిషినల్ సింబల్ (సాంప్రదాయికపు టంటకుండలకు ప్రతినిధి). హేతువాదం సుబ్బరామయ్య బాబయ్యకు ఆదినుంచీ వారి దాంపత్యానికి అడ్డుగా ప్రవహిస్తూ వచ్చినది అతని హేతువాదమే. ఈగ పుండుమీద వాలినట్లు మా ఆయన కన్నీ కుళ్ళు సంగతులే కావాలి (హాయిగా రామకృష్ణా అనుకోక - రాముడూ, కృష్ణుడూ అంటే మా హేతువాదం సుబ్బరామయ్య బాబయ్య మండిపడతాడు), అని మొగుడ్ని ఆడిపోసుకుంటూ వుంటుంది.

సుబ్బరామయ్య చూడ్డానికి రివటలా సన్నగా, గాజు గొట్టంలా వున్నాడు కాని, అతని బుర్ర చాలా ప్రమాదకరమైనది. మా చిన వెంట్రావుడు పిన్నికి భక్తి ఎక్కువ. భక్తిరసం కారుతూ వుంటుంది ఆవిడ వంటింట్లో.... దేవుడు వంటింట్లోనే కదా నివాసం - ఏ యిల్లయినా ముందుగదిలో క్యాలెండర్లూ, పడగ్గదిలో సినిమా తారలూ రకరకాల దేవుళ్ళూ, ఆఖరికి దేవుని పర్మనెంటు హెడ్‌క్వార్టర్స్ వంటిల్లే. ఆడదానికి ఎప్పుడవసరమైనా, దేవుడుకూడా హాండీగా వూరగాయ జాడీల పక్కనే అందుబాటులో వుండాలుండాలి.

మా చిన వెంకట్రావుడు పిన్ని తన మొగుడ్ని ఛండాలపు మొగుడమ్మా ఆయనవన్నీ ఛండాలపు బుద్ధులు అని దెప్పుతుంది.

అయితే ఆవిడ అలా భర్తమీద చేటల్తో చెరిగిపోయటానికి సుబ్బరామయ్య హేతువాదమే కారణమని అందరూ అంటారు.

రామాయణమ్మీద సుబ్బరామయ్యకు యీషణ్మాత్రం గౌరవం లేదు. అతను బాల, అయోధ్యకాండలు, ఉత్తరకాండలు కల్పించినవేనంటాడు. నోరు మూసుకోండి కళ్లు పోతాయంటుంది మా చిన వెంకట్రావుడు పిన్ని. దశరథుడు మగాడుకాద్ట. అందుకే పుత్రకామేష్ఠి అని పేరెట్టి ఋష్యశృంగుడ్ని రప్పించాడ్ట -

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు దశరథాత్మజులు కార్ట - ఋష్య శృంగుడికే పుట్టారట అన్నాడ్ట మా హేతువాదం సుబ్బరామయ్య. మీరు లెంపలు వాయించుకుంటారా నన్ను వాయించమంటారా అని లేచిందట అమ్మశక్తిలా మా చిన వెంకట్రావుడు. కాని మా బాబయ్య ఏంతక్కువ తినలేదు.

అసలు రామాయణం ఇండియాలోనే జరగలేదని ఓ వాదనుందట. ఒకవేళ జరిగినా శ్రీరాముడు వింధ్యపర్వతాలు దాటి ఒక ఇంచికూడా అడుగావల పెట్టలేదట. లంక అంటే యిప్పుడున్న రేడియో సిలన్‌వారి సిలన్ కాదట - అస్సలు రామాయణం వార్ ఆర్యన్ ద్రవిడియన్

సంఘర్షణ కానేకాదుట. అది పంటలు పండించేవారికి పండిన పంటలను పంచే వారికీ మధ్యవచ్చిన ఏదో గొడవట. సరిగ్గా యిటువంటి సందర్భంలోనే మా పిన్ని మా బాబయ్యను పుండుమీద వాలిన ఈగగా అభివర్ణించింది.

మరొక ఆర్గ్యుమెంటు చెప్పింది. మీరు వింటే ఆశ్చర్యపోతారు. అస్సల్ తారెత్తి పుంజాల్ తెంపుకు పారిపోతారు. అసలు సీతకూడా దశరథుడి కూతురేట. రాముడికి సీత చెల్లెలవుతుందిట. ఈజిప్టులో జరిగిందట రామాయణం. కాని ఇండియాలో జరగలేదట. మా బాబయ్యకు మూడ్రోజులుదాకా ఇంట్లో కాఫీఫలహారాలుకాదు కదా మంచినీళ్లు కూడా పుట్టలేదు.

అప్పుడు మేవంతా మా బాబయ్యను చుట్టుముట్టి ఘెరావ్ చేసి రకరకాల ప్రశ్నలు వేశాం. మీరెవరైనా రామాయణం చదివారా అని అన్నాడు. నిజానికి లవకుశ సినిమా చూశాం. కాని మేమెవరమూ రామాయణం చదవలేదు. హరికథలు విన్నాం - వాల్మీకి రామాయణం చదివారా లైన్ బై లైన్ అన్నాడు. బుర్రలు అడ్డంగా వూయించాము. అయోధ్యలో మద్యం అంటే సారావగైరాలు పుష్కలంగా దొరికేవట. రాముడు సీత ఓపిగ్గా కంట్రీ లిక్కరు పుచ్చుగునేవారట. రామరాజ్యం అంటే మురార్జీ అనుకున్నట్లు గాంధీగారు పొరబడినట్లు మద్యనిషేధం, అహింస, రాట్నం వగైరా వగైరాలు రామరాజ్యం తాలూకు సింబల్స్ కావెంతమాత్రం కావు. రామరాజ్యంలో ప్రొహిబిషనుండదండీ - సీతా రాములు గొప్ప బూజర్స్ - లేడిమాంసం వగైరాలంటే సీతారాములుకి మహాప్రీతి. మా బాబయ్య మాటలువిని మేం కుదేలయిపోయి చతికిల బడ్డాం.

అప్పుడు పిన్ని "ఇలాంటి కారుకూతలు కూస్తున్నారు మీరు నరకానికే పోతారు సుమండి" అని అరిచింది. నేను రోజూ రామాయణం చదువుతాను, పఠిస్తాను, పరిశీలిస్తాను. రోజూ రామాయణం చదివేవారు అంతా నరకానికే పోతే నేనూ నరకానికేపోతాను అన్నాడు మా బాబాయి.

మా పిన్ని రామనవమికి భద్రాచలం ప్రయాణం పెట్టుకుంది. మా బాబయ్య శ్రీరాముడు వింధ్యపర్వతాలు దాటి ఒక యించి కూడా యివతలకి రాలేదంటూంటే నువ్ భద్రాచలం ఎందుకువెళ్ళటం. అక్కడ రామదాసు స్టోరీ అంతా మోసం. పర్ణశాల వగైరా వగైరా, సీతమ్మ వారు స్నానమాడిన చోటు, కుంకం ఎట్‌సెట్రా అంతా మీ పిన్నిలాటి సెంటిమెంటల్ ఫూల్స్ కోసం కల్పించిన పుక్కిటిపురాణాలే కాని నిజం ఎంతమాత్రంకావు. శ్రీరాముడు మనందరిలాగే ఆర్డినరీ పురుషుడేకాని దిగొచ్చిన దేవుడు కాదు. ఇప్పుడు మావోని గాంధీని యింకా వగైరా వగైరాలను మనం అవతార పురుషులుగా ఎలా ట్రాన్స్‌ఫారం చేస్తున్నామో, అలాగే మన పూర్వీక్స్ జాగ్రత్తగా ప్లాన్ చేసి తమ నాలుగువర్ణాల వేదిక్ కల్చర్‌ను, కర్మకాండను నిలబెట్టుకోవడంకోసం రామాయణాన్ని సైతం కంగాళీ (కరప్ట్) చేశారు. దశరథుడు పెళ్ళాలకు జడిసేవాడ్ట - కైకగ్రూపూ, కౌసల్య గ్రూపూ అని కిచెన్ కాబినెట్స్ వుండేవట (ఇప్పుడు మన

ఇందిరాగాంధీగారికి కూడా కిచెన్ కాబినెట్ లేదూ అలాగే) మా బాబయ్య నిత్యం రామాయణం మహాభారతం యింకా పురాణాలు వగైరా చదువుతాడు. కాని ఏం లాభం? హేతువాదం సుబ్బరామయ్యగారంటే మా ఊళ్ళో అందరికీ తెలుసు.

మా పిన్నికీ బాబయ్యకీ ఒక్కక్షణం పడదు. పడకపోయినా ఫ్రాయిడో ఎవరో చెప్పినట్లు వారిది అన్యోన్య దాంపత్యం కాకపోయినా పిల్లలు ముచ్చటగా పుట్టుకొచ్చారు. ఇప్పుడు పిల్లలెక్కడ హేతువాదం పిల్లలయిపోతారేమోనని మా పిన్ని పురాణవైరి గ్రంథాల్ను తెచ్చి చదివించి జాగ్రత్తపడుతూ వుంటుంది. పెద్దపిల్లాడు సూర్య వెంకట సత్యసాయీప్రసాద్ "మన వెంకటేశ్వరస్వామి విగ్రహం మగాడు కాడుట. ఆడది శక్తి విగ్రహంటగా అమ్మా - అందుకే గుండెలమీద అన్ని అలంకరణలు చేసి ఏవేవో కప్పుతారట. విగ్రహాన్ని మనల్నెవర్నీ చూడనివ్వరట నాన్న చెప్పాడు" అంటూ బాంబు పేల్చాడు. వీడుకూడా నరకానికే పోతున్నట్లనిపించి మా భీవుడుపిన్ని నోరు తెరుచుకుని అలానే నిలబడిపోయింది. ఆ రోజు రోజల్లా దేవుడిగదిలో మా పిన్ని కుప్పలా కూలబడి ఏడుస్తూనే వుంది. నిజం ఎంత కర్కశంగా కఠినంగా వుంటుందో, సెంటిమెంటు అబద్ధం కల్పన ఎంత చల్లగా తియ్యగా మత్తుమందులా వుంటాయో, నాకు కొంచెం కొంచెం బోధపడసాగింది. నూరు అబద్ధాలాడైనా ఒక కొంప నిలబెట్టమన్నారు. మనవాళ్ళు కొన్ని కోట్ల అబద్ధాలాడైనా దేవుళ్ళ కొంపలు నిలబెట్టడానికే కంకణం కట్టుకున్నారు.

అవే మన శాస్త్రాలూ పురాణాలూను - మా వెంకట్రావుడు పిన్ని హిందూ ఆడదానికి ట్రెడిషనల్ సింబల్ - ఆవిడకు వున్న ఒక్క మెంటల్ ఉపశమనను చెరిపేస్తే ఇక ఏం మిగులుతుంది? సత్యం చాలా కఠినమైనది, క్రూరమైనది. మా హేతువాదం సుబ్బరామయ్య బాబయ్య ఆ మార్గంలో పురోగమిస్తున్నాడు. పురాణాల్ని, అభూతకల్పనల్నీ, దేవుళ్ళనీ నమ్మేవారి తులసివనంలో గంజాయిమొక్కలా గుంటాడు మా బాబయ్య. నమ్మనివారు అటు దిటు తిరగేసి చెప్తారు - అంతే తేడా! మన దేశంలో సోషల్ రిఫారమ్ అనగా వెధవముండల పెళ్ళిళ్ళు, అస్పృశ్యతా నివారణ జాతి మతభేదములు లేని వ్యవస్థ అంటూ ప్రాకులాడితే అంది పై నుంచి రాదు. లోపల రావణాసురుడి కడుపుమీద కొట్టినట్లు వీటన్నిటికీ బేస్ అయిన మూఢనమ్మకాలమీద దెబ్బతీయాలి. రెలిజన్‌కి కొంత డామేజీ జరిగితే జరుగుతుంది. దేశీయసమైక్యత అంటూ పదిపైసల బిళ్ళలు కొనిపెట్టుకు తిరిగితే అదెలా వస్తుంది? కుండ బద్దలు కొట్టినట్లు కాదు. కుండ బద్దలు కొడితేనేకాని మన కంట్రీకి మోక్షం లేదు. సో సెడ్ అంకుల్ సుబ్బరామయ్య– "నేను ఒక అర్ధశతాబ్దం తరవాత పుట్టవలసిన వాడ్ని" అంటూంటాడు మా అంకుల్. అయ్యో నా ప్రాణం తీయటానికి ముందే ఎందుకు పుట్టారండీ? అని మా పిన్ని వాపోతూ వుంటుంది.